TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక

J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony,
Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

సంపుటి : 3 | సంచిక : 310 | గురువారం 6 మార్చి 2025 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper




## అఖిలపక్ష సమావేశంలో తీర్మానం

**విల్లివాకం న్యూస్:** నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలో బుధవారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 56 పార్టీలు పాల్గొనగా, బీజేపీ, తమిళ రాష్ట్ర కాంగ్రెస్, నామ్ తమిళర్ కట్చి సహా 5 పార్టీలు సమావేశాన్ని బహిష్కరించాయి. ఈ సమావేశంలో 2026 జనాభా ప్రాతిపదికన 30 ఏళ్లు వాయిదా వేయాలని, 1977 జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను మరో 30 ఏళ్లు పొడిగించాలని కోరారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణను 30 ఏళ్లపాటు వాయిదా వేస్తున్నట్లు పార్లమెంట్‌లో ప్రకటించాలని ప్రధానిని కోరుతూ తీర్మానాన్ని చదివి వినిపించారు. దీంతో అన్ని పార్టీల మద్దతుతో తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ నేపథ్యంలో రాజకీయ విభేదాలున్నా అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వారందరికీ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళల కోసం రాపిడో టూ వీలర్ ట్యాక్సీ యాప్




**విల్లివాకం న్యూస్:** భారతదేశంలోని ప్రముఖ కంపెనీ రాపిడో యాప్ మొదటిసారిగా పింక్ మొబిలిటీ చొరవ యొక్క ఒక సంవత్సరం వార్షికోత్సవాన్ని పూర్తి చేసింది. తమిళనాడు ప్రభుత్వ మద్దతుతో 2023లో ప్రారంభించబడిన ఈ ప్రాజెక్ట్ పూర్తిగా మహిళా-కేంద్రీకృత ఉద్యమంగా పునర్నిర్వచించబడింది. చెన్నైలో బుధవారం ఏర్పాటైన ఈ కార్యక్రమానికి దక్షిణ చెన్నై పార్లమెంటు సభ్యురాలు తమిళచ్చి తంగపాండియన్ హాజరై ర్యాపిడో యాప్ యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. పింక్ మొబిలిటీ ఇనిషియేటివ్ అనేది మహిళల కోసం సురక్షితమైన రవాణా పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి ఒక దూరదృష్టితో కూడిన చొరవ అని, మహిళలకు, మహిళలతో సరసమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ఇది సురక్షితమైన టాక్సీ సేవగా ప్రారంభించబడిందన్నారు. రవాణా రంగంలో కొత్త సవాలుగా కనిపిస్తున్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోందని అన్నారు. తమిళనాడు ప్రభుత్వం యొక్క నిరంతర మద్దతు ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి కీలకమైనదని తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రిక్ స్కూటర్ తాళపు చెవులను వేపిడు పింక్ కెప్టెన్ రాపిడో ఇంజనీరింగ్ టీంకు చెందిన శర్వాణి, లీగల్ టీంకు చెందిన శరణ్య, చెన్నై జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) గోపిదాస్‌కు అందజేశారు.

## నేను ఆత్మహత్యాయత్నం చేయలేదు



**హైదరాబాద్:** తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడలేదని, తన కుమార్తె విషయంలో చోటు చేసుకున్న మనస్పర్థల వల్ల నిద్ర పట్టక అధిక మొత్తంలో నిద్ర మాత్రలు వేసుకోవడం వల్ల అపస్మారక స్థితిలోకి వెళ్లినట్టు కల్పన తెలిపారు. ఈ విషయానికి సంబంధించి కేపీహెచ్‌బీ పోలీసులు ప్రెస్‌నోట్ విడుదల చేశారు. "కల్పన గత 5 సంవత్సరాల నుంచి భర్తతో కలిసి హైదరాబాద్‌లోని విల్లాలో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె దయ ప్రసాద్‌కి, కల్పనకు మధ్య చదువు విషయంలో ఇటీవల మనస్పర్థలు వచ్చా యి. అనంతరం ఆమె హైదరాబాద్‌కు చేరుకు న్నారు. అదే సమయంలో కల్పన భర్త ప్రసాద్.. ఆమెకు పలుమార్లు ఫోన్ చేయగా స్పందన లేదు. దీంతో, ప్రసాద్ కాలనీ వెల్ఫేర్ సభ్యులకు ఫోన్ చేసి చెప్పగా, వారు DIAL 100కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కేపీహెచ్‌బీ పోలీసులు, కాలనీ వెల్ఫేర్ మెంబర్స్ ఇంటి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో వెనుక వైపు ఉన్న కిచెన్ డోర్ నుంచి లోపలికి ప్రవేశించి, బెడ్ రూమ్‌లో అపస్మారక స్థితిలో ఉన్న కల్పనను సమీపంలోని ఆస్పత్రికి తరలించాం" అని పోలీసులు వెల్లడించారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు



**అమరావతి:** ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోదరుడు, జనసేన నేత నాగ బాబు పేరు ఖరారైంది. ఎమ్మెల్యే కోటా అభ్యర్థిగా ఆయన పేరును జనసేన అధినేత పవన్ ఖరారు చేశారు. నామినేషన్ వేయాలని నాగబాబు కు ఆయన సమాచారం ఇచ్చారు. కొద్దిరోజుల కిందట ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు తెదేపా, ఒకటి భాజపా తీసుకున్నాయి. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక సమయంలో నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోబో తున్నట్లు తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించారు. పవన్ కల్యాణ్ కోరిక మేరకు తొలుత ఆయన్ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానం ఆయన కోసం కేటాయించారు. తీరా శాసనమండలి ఎన్నికల షెడ్యూలు వెలువడిన తరువాత నాగబాబుకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇవ్వనున్నట్లు ప్రచారం జరిగింది. కానీ, తాజాగా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగానే నాగబాబు పేరును ఖరారు చేశారు.

TELUGU NEWS TIMES
తెలుగు న్యూస్ టైమ్స్
జాతీయ దిన పత్రిక
గురువారం 6 మార్చి 2025

## ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు వచ్చాక నేరాలపై పీడీ కేసులు




**ఢిల్లీ:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాటాడారు. "ఇవాళ రెండు కీలక సమావేశాలు జరిగాయి. రాజకీయ పరిణామాల గురించి హెూం మంత్రి అమిత్ షాతో చర్చించాం. ఎన్డీయే ముమ్ముందు ఏవిధంగా ముందుకెళ్లాలనే దానిపై చర్చ జరిగింది. ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ ప్రొవిజన్ బిల్లు గురించి చర్చించాం. భూములకు సంబంధించి కంప్యూటరీకరణలో కొన్ని సమస్యలు వచ్చాయి. గతంలో అధికారులు, నాయకులు కలిసిపోయారు.

ప్రైవేటు భూములను బలవంతంగా 22ఈలో చేర్చారు. అటవీ భూములను కూడా ఆక్రమించారు. గుజరాత్‌లో ల్యాండ్ గ్రాబింగ్ బిల్లును విజయవంతంగా అమలు చేశారు. ఏపీ శాసనసభ, మండలి ముందుకు ఈ బిల్లు వచ్చింది. ల్యాండ్ గ్రాబింగ్ బిల్లును త్వరగా ఆమోదించాలని కోరాం. ఈ బిల్లులో పట్టణ, గ్రామీణ భూములు ఉన్నాయి. ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు వచ్చాక నేరాలపై పీడీ కేసులు పెడతాం. రాష్ట్రంలో గంజాయి సాగు, డ్రగ్స్ పెద్ద సమస్యగా ఉంది. వీటి నిర్మూలను వ్యవస్థలు ఏర్పాటు చేశాం. గంజాయి కట్టడి చేస్తే ఉపాధితో పాటు ప్రోత్సాహకాలు ఇస్తాం. గంజాయి డ్రగ్స్ నిర్మూలనకు మరో బిల్లు తీసుకువస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

## రాహుల్ గాంధీకి రూ.200 జరిమానా..



ఓ కేసు విషయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఉత్తర్‌ప్రదేశ్‌లోని న్యాయస్థానం రూ.200 జరిమానా విధించింది. పదే పదే విచారణకు గైర్హాజరు అవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 14న తదుపరి విచారణకు హాజరు కాకుంటే మాత్రం తీవ్ర చర్యలుంటాయని రాహుల్ గాంధీని హెచ్చరించింది. మహారాష్ట్రలో 2022లో మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. వీర్ సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు స్వాతంత్ర్య సమరయోధుడైన వీర్ సావర్కర్‌ను కించపరిచే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే వ్యక్తి యూపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేవిధంగా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని అందులో పేర్కొన్నారు.

ఈ పిటిషన్‌కు సంబంధించి తాజాగా మరోసారి విచారణ జరిగింది. రాహుల్ గాంధీ తరఫున న్యాయవాది ప్రన్షు అగర్వాల్ హాజరై.. ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ బిజీగా ఉన్నారని, వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అయితే, పదే పదే విచారణకు గైర్హాజరవుతున్న నేపథ్యంలో ఆయనకు రూ.200 జరిమానా విధించిన అప్పర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం.. తదుపరి విచారణకు రాహుల్ తప్పకుండా హాజరు కావాలని ఆదేశించింది. లేని పక్షంలో నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ చేస్తామని హెచ్చరించింది.

## నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయం



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రలోని భాజపా, ఇతర రాష్ట్రాల్లోని పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తుందన్నారు. దీన్ని అంగీకరించమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ఆయా రాష్ట్రాలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలి. ఈ విభజన ప్రక్రియ తాజా జనాభా లెక్కల ఆధారంగా ఉంటే పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గే ప్రమాదం ఉంది. దీన్ని ఏమాత్రం అంగీకరించం. గత 50 ఏళ్లుగా తమిళనాడుతో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాలు జనాభా పెరుగుదలను నియంత్రించాయి. ఈక్రమంలో ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలు విభజించడం సరికాదు. ఒకరి గెలుపు కోసం ఇంకొకరిని శిక్షించడం అన్యాయం. దక్షిణాది రాష్ట్రాల్లోని నియోజకవర్గాల సంఖ్య తగ్గినా.. ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఆ సంఖ్య పెరిగినా సహించేది లేదు. అన్ని పార్టీలతో కలిసి దీనిపై పోరాడతాం. ప్రజాప్రతినిధుల కొరత సాధారణ ప్రజలకు సమస్యే కాదు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నాణ్యమైన విద్య, వైద్యం, రోడ్లు వంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముందు వాటిపై దృష్టి సారించాలి' అని ప్రకటనలో పేర్కొన్నారు.

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ద్వారా తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో పార్లమెంట్ స్థానాలు తగ్గుతాయంటూ తమిళనాడు కొంతకాలంగా చెబుతోంది. ఈ వ్యాఖ్యలను కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా కొట్టిపడేశారు. అయినప్పటికీ దీనిపై పలు రాష్ట్రాల తమ ఆందోళనను వ్యక్తంచేస్తున్నాయి. ఇక, ఈ అంశంపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అందులో 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

## ఆర్‌బీఐ కీలక నిర్ణయం.. బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీగా నిధులు

**ముంబయి:** బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీగా నిధులు జొప్పించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరోసారి పలు చర్యలను ప్రకటించింది. బహిరంగ మార్కెట్ కార్యకలాపాల ద్వారా సెక్యూరిటీల కొనుగోలు, డాలరు, రూపాయి స్వాప్ వంటి చర్యల ద్వారా నెల రోజుల వ్యవధిలో రూ.1.9 లక్షల కోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 28న 10 బిలియన్ డాలర్లకు సమానమైన డాలర్- రూపాయి వేలాన్ని నిర్వహించిన ఆర్‌బీఐ.. లిక్విడిటీని మరింత పెంచేందుకు మరోసారి చర్యలు చేపట్టింది. ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ ద్వారా రూ.1 లక్షల కోట్లకు సమానమైన ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయనున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. రూ.50వేల కోట్లు చొప్పున రెండు దఫాలుగా మార్చి 12, మార్చి 18 తేదీల్లో ఈ సెక్యూరిటీస్ కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపింది. దీంతో పాటు మార్చి 24న మరో 10 బిలియన్ డాలర్ల యూఎస్‌డీ/ఐఎన్‌ఆర్ బై/ సెల్ స్వాప్ వేలాన్ని కూడా ఆర్‌బీఐ నిర్వహించనుంది. ఎప్పటికప్పుడు నగదు లభ్యతను సమీక్షిస్తామని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని ఆర్‌బీఐ ప్రకటించింది. జనవరి, ఫిబ్రవరి నెలల్లోనూ కూడా ఇదే తరహా చర్యలను ఆర్‌బీఐ చేపట్టింది.

## తెలుగు ప్రముఖుడు తాళ్లూరి సురేష్, ఏపీ మంత్రి బీసీ జనార్ధన రెడ్డిని సత్కరించారు



**అమరావతి:** విజయవాడ, బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ మంత్రి బీసీ జనార్ధన రెడ్డిని చెన్నైకి చెందిన ప్రముఖ తెలుగు పారిశ్రామికవేత్త, సమాజసేవకుడు తాళ్లూరి సురేష్ బుధవారం ఉదయం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి జనార్ధన రెడ్డిని శాలువాతో సత్కరించి, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధిపై చర్చ: తాళ్లూరి సురేష్, ఏపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, పారిశ్రామిక విస్తరణ, విద్యా వ్యవస్థ అభివృద్ధి అంశాలపై మంత్రితో చర్చించారు.

పారిశ్రామిక పెట్టుబడులపై దృష్టి: చెన్నైతో పాటు దేశవ్యాప్తంగా తెలుగు పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న విషయాన్ని సురేష్ వివరించారు. సామాజిక సేవలో సహకారం: తెలుగు సాంస్కృతిక, సామాజిక రంగాల్లో ముందుండే తాళ్లూరి సురేష్, ప్రభుత్వ కార్యక్రమాలకు తమ వంతు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ సమావేశం రాష్ట్రంలోని వ్యాపార, పారిశ్రామిక రంగాలకు కొత్త మార్గాలను తెరవవచ్చని రాజకీయ, వ్యాపార వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీని తొలగించండి



కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యా విధానం అమలు విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ .. మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. తమిళనాడులోని అన్ని కేంద్ర కార్యాలయాల నుంచి హిందీని తొలగించాలన్నారు. తమిళంపై ప్రేమ ఉంటే.. చేతల్లో చూపించాలన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు.

'ప్రధాని నరేంద్ర మోదీకి తమిళం అంటే అపారమైన ప్రేమ అని భాజపా చెబుతోంది. అదే నిజమైతే.. దాన్ని ఆయన చేతల్లో ఎందుకు చూపించడం లేదు..?. పార్లమెంటులో సెంగోల్‌ను ఏర్పాటుచేయడం కంటే.. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీని తొలగిస్తే బాగుంటుంది. హిందీకి బదులుగా తమిళాన్ని అధికార భాషగా చేసి.. మరిన్ని నిధులు కేటాయించండి. కేంద్ర బడ్జెట్‌లో తిరుక్కురల్‌ను ఉటంకిస్తే సరిపోదు. రాష్ట్రానికి ప్రత్యేక పథకాలు, సత్వర విపత్తు సహాయ నిధి, కొత్త రైల్వే ప్రాజెక్టులను అందించాలి. రైళ్లకు అంత్యోదయ, తేజస్, వందేభారత్ వంటి పేర్లు పెట్టడం ఆపండి. దానికి బదులు తమిళ పేర్లను పెట్టండి. తమిళ భాషపై ప్రేమను మాటల్లో కాకుండా.. చేతల్లో చూపించండి' అని స్టాలిన్ పేర్కొన్నారు.

**తమిళనాడు గొంతు నొక్కేస్తున్నారు..** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన ప్రక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని స్టాలిన్ అభ్యర్థించారు. ప్రస్తుత జనాభా ప్రకారం.. పార్లమెంటులో తాము 12 సీట్లు కోల్పోయి.. 10 సీట్లు మాత్రమే వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తమిళ రాజకీయాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనన్నారు. ఈ చర్య రాష్ట్ర గొంతును నొక్కేస్తుందన్నారు. తాము విభజనకు వ్యతిరేకం కాదని.. కానీ, గత 50 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన తమకు ఇది శిక్ష కాకూడదన్నారు. ఈ సందర్భంగా 2026 జనాభా లెక్కల ఆధారంగా విభజన ప్రక్రియ చేపట్టరాదని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది.

## నైపుణ్యాభివృద్ధితోనే ఉద్యోగ కల్పన సాధ్యం..

**ఢిల్లీ:** ప్రజల్లో నైపుణ్యాభివృద్ధి, ప్రతిభను పెంపొందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోనే ఉద్యోగ కల్పన సాధ్యమవుతుందని ప్రధాని మోదీ అన్నారు. అప్పుడే ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని చెప్పారు. ఇందుకు భాగస్వామ్యపక్షాలన్నీ కలిసి రావాలని, నైపుణ్యాభివృద్ధికి, ఆవిష్కరణలకు తోడ్పాటు అందించాలని కోరారు. బడ్జెట్ అనంతరం ఉద్యోగ కల్పన అంశంపై నిర్వహించిన వెబినార్‌లో ఆయన పాల్గొని బుధవారం మాట్లాడారు.



# కేదార్‌నాథ్ రోప్‌వేకి కేంద్ర కేబినెట్ ఆమోదం



కేదార్‌నాథ్ రోప్‌వే నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ .4,081 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్.. 8-9 గంటలు పట్టే కఠినమైన ట్రెక్కింగ్‌ను కేవలం 36 నిమిషాల ప్రయాణానికి తగ్గిస్తుంది. యాత్రికులకు వేగవంతమైన, సురక్షితమైన, మరింత సౌకర్య వంతమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది.

**ప్రాజెక్టు వివరాలు** : సోన్ ప్రయాగ్ నుంచి కేదార్ నాథ్ ను కలుపుతూ రోప్ వే 12.9 కిలోమీటర్లు ఉంటుంది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ఓటీ) మోడల్ కింద ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. ప్రతి దిశలో గంటకు 1,800 మంది ప్రయాణికులను తీసుకెళ్లగల అధునాతన ట్రై-కేబుల్ డిటాచబుల్ గొండోలా (3ఎస్) సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రాజెక్టు ఉపయోగిస్తుంది.

**ప్రయోజనాలు** : కేదార్‌నాథ్ రోప్ వే యాత్రికులకు గేమ్ ఛేంజర్‌గా నిలవనుంది. అన్ని రకాల వాతావరణాల్లో 12 పవిత్ర జ్యోతిర్లింగాలలో ఒకటైన ఈ ఆలయాన్ని సందర్శించే భాగ్యం భక్తులకు కలుగుతుంది. ప్రస్తుతం గౌరీకుండ్ నుంచి కాలినడకన, గుర్రాల ద్వారా లేదా హెలికాప్టర్ సర్వీసుల ద్వారా 16 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లాల్సి వస్తోంది. రోప్ వే ఈ ప్రయాణాన్ని సులభతరం చేయడమే కాకుండా వృద్ధులు, దివ్యాంగ యాత్రికులకు మరింత సమ్మిళిత అనుభవాన్ని అందిస్తుంది.

అంతేకాకుండా ఈ ప్రాజెక్టు ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని పెంచుతుందని, నిర్మాణం, కార్యాచరణ దశలలో గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని భావిస్తున్నారు. ఆతిథ్యం, ట్రావెల్, ఆహార, పానీయాల వ్యాపారాలు వంటి అనుబంధ పరిశ్రమలు కూడా ప్రయోజనం పొందే అవకాశం ఉంది. ఇది ఈ ప్రాంత సామాజిక-ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తుంది.

**పర్యావరణ, ఆర్థిక ప్రభావం** : సంప్రదాయ రవాణా విధానాలతో ముడిపడి ఉన్న కేదార్‌నాథ్ సందర్శనలో పర్యావరణ హితంగా రోప్‌వేను రూపొందించారు. గుర్రాలు, హెలికాప్టర్లపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా, సుస్థిర ప్రయాణ పరిష్కారాన్ని అందిస్తూ పెళుసైన హిమాలయ పర్యావరణ వ్యవస్థను పరిరక్షించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఆర్థికంగా, కొండ ప్రాంతాలలో సమతుల్య అభివృద్ధిని పెంపొందించే దిశగా ఈ ప్రాజెక్టు ఒక ముఖ్యమైన అడుగు. లాస్ట్ మైల్ కనెక్టివిటీని పెంపొందించడం, మారుమూల ప్రాంతాల్లో వేగవంతమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించాలనే ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా ఈ ప్రాజెక్ట్ ఉంటుంది.




**మరో రోప్‌వేకీ గ్రీన్ సిగ్నల్** : కనెక్టివిటీని పెంచడానికి, పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి మరో రోప్‌వేకి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉత్తరాఖండ్‌లోని గోవింద్‌ఘాట్ నుండి హేమకుండ్ సాహిబ్‌జి వరకు 12.4 కిలోమీటర్ల పొడవైన రోప్వే ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి ఆమోదం తెలిపింది. నేషనల్ రోప్ వేస్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ 'పర్వతమాల పరియోజన'లో భాగంగా ఈ ప్రాజెక్ట్‌లను కేంద్ర ప్రభుత్వం చేపడుతోంది.

రూ.2,730.13 కోట్ల అంచనా వ్యయంతో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్ఫర్ (డీబీఎఫ్ఓటీ) మోడల్ కింద ఈ రోప్‌వేను అభివృద్ధి చేయనున్నారు. గోవింద్‌ఘాట్ నుంచి ఘంగారియా స్ట్రెచ్ (10.55 కిలోమీటర్లు) కోసం మోనోకేబుల్ డిటాచబుల్ గోండోలా (ఎండీజీ) వ్యవస్థ, ఘంగారియా నుంచి హేమకుండ్ సాహిబ్ జీ స్ట్రెచ్ (1.85 కిలోమీటర్లు) కోసం ట్రైకబుల్ డిటాచబుల్ గోండోలా (3ఎస్) వ్యవస్థతో సహా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నారు. ఈ రోప్ వే యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం అయిన వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్‌కు ప్రవేశ ద్వారంగా మారనుంది.

# భారత్ చేతిలో ఓటమి.. వన్డేలకు స్టీవ్‌స్మిత్ గుడ్‌బై

**ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియాకు షాక్ తగిలింది. భారత్ చేతిలో ఆరు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. దీంతో వన్డేలకు ఆ జట్టు సారథి స్టీవ్ స్మిత్ వీడ్కోలు పలికేశాడు. బ్యాటర్‌గా స్మిత్ (73) రాణించినా జట్టు మాత్రం విజయం సాధించలేకపోయింది. దీంతో 35 ఏళ్ల స్మిత్ అంతర్జాతీయ వన్డేలకు రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. అయితే, టీ20లతోపాటు టెస్టుల్లో కొనసాగుతానని వెల్లడించాడు.**

"జాతీయ జట్టు తరఫున ఆడటం ఎప్పుడూ గర్వకారణమే. వన్డేల్లో ప్రతి క్షణమూ ఆస్వాదించా. ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు ఉన్నాయి. రెండు వరల్డ్ కప్‌ల్లో సభ్యుడిగా ఉన్నా. ఇప్పుడీ నిర్ణయంతో వన్డే ప్రపంచ కప్ 2027 కోసం జట్టును సన్నద్ధం చేసేందుకు ఆసీస్ మేనేజ్‌మెంట్‌కు అవకాశం వచ్చినట్లవుతుంది. ఇప్పటికీ నాకు టెస్టు క్రికెట్ మొదటి ప్రాధాన్యం. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకున్నాం. వెస్టిండీస్, ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లు ఉన్నాయి. టెస్టు క్రికెట్‌ను ఇంకా ఆడగలనని భావిస్తున్నా" అని స్మిత్ వెల్లడించాడు.

ఆస్ట్రేలియా తరఫున 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన స్మిత్ ఇప్పటివరకు 170 వన్డేలు ఆడాడు. 12 సెంచరీలు, 35 అర్ధశతకాలతో 5,800 పరుగులు చేశాడు. బౌలర్‌గానూ 28 వికెట్లు పడగొట్టాడు. 116 టెస్టులు ఆడిన స్మిత్ 10,271 పరుగులు చేశాడు. 67 అంతర్జాతీయ టీ20ల్లో 1,094 పరుగులు చేశాడు. 2015, 2023 వన్డే ప్రపంచకప్‌లను నెగ్గిన ఆసీస్ జట్టులో స్మిత్ సభ్యుడు.

ఇటీవల కాలంలో ఆసీస్ నుంచి వన్డేలకు వీడ్కోలు పలికిన రెండో ఆటగాడిగా స్మిత్ నిలిచాడు. ప్యాట్ కమిన్స్ గాయం కారణంగా స్మిత్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. ఈ టోర్నీలో సెమీస్‌లోనే ఆసీస్ ఓటమిపాలు కావడంతో స్మిత్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడు. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కాకముందే మార్కస్ స్టాయినిస్ అనూహ్యంగా వన్డేలకు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. గాయం కారణంగా అతడు ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడని అప్పట్లో వార్తలు వచ్చాయి.

# అమెరికా సాయం కోరిన సీబీఐ




**ఢిల్లీ** : 1980-90ల్లో దేశ రాజకీయాలను కుదిపేసిన బోఫోర్స్ కుంభకోణంపై సీబీఐ మరోసారి సమగ్ర దర్యాప్తునకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే కేసుకు సంబంధించిన యూఎస్ ప్రైవేటు ఇన్వెస్టిగేటర్ నుంచి కీలక సమాచారం సేకరించేందుకు దర్యాప్తు సంస్థ అమెరికా సాయం కోరింది. అతడి నుంచి సాక్ష్యాలు తీసుకునేందుకు అనుమతినివ్వాలంటూ అగ్రరాజ్యానికి న్యాయపరంగా అభ్యర్థన పంపింది. ఫెయిర్‌ఫాక్స్ గ్రూప్ అధినేత, ప్రైవేటు ఇన్వెస్టిగేటర్ మైఖేల్ హెర్ష్‌మన్ 2017లో భారత్‌లో పర్యటించారు. ఆ సమయంలో పలు ఇంటర్వ్యూల్లో పాల్గొన్న ఆయన.. బోఫోర్స్ కుంభకోణం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ కేసును పక్కదారి పట్టించేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. దాని గురించి ముఖ్యమైన సమాచారాన్ని పంచుకునేందుకు తాను సిద్ధమేనని వ్యాఖ్యానించారు. మైఖేల్ ఆరోపణలను సీబీఐ సుమోటోగా స్వీకరించి దర్యాప్తు చేపట్టింది. అతడి నుంచి సమాచారం తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ అమెరికా అధికారులకు పలుమార్లు లేఖలు పంపింది. అటు నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో లెటర్ రొటేటరీ పంపేందుకు భారత హోంశాఖను సంప్రదించింది. కేసుల విచారణ, దర్యాప్తు సహకారం కోసం ఒక దేశంలోని కోర్టు.. మరో దేశంలోని కోర్టుకు లిఖిత పూర్వకంగా పంపే అభ్యర్థనే ఈ లెటర్ రొటేటరీ (ఎల్ఆర్). దీన్ని పంపేందుకు ఈ ఏడాది జనవరి 14న హోంశాఖ సీబీఐకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అనంతరం ప్రత్యేక కోర్టులో ఫిబ్రవరి 11నే ఈ ఎల్ఆర్ అప్లికేషన్‌ను దర్యాప్తు సంస్థ అమెరికాకు పంపించింది. దీనిపై అగ్రరాజ్యం నుంచి స్పందన రావాల్సిఉంది.

**ఏంటీ కుంభకోణం..** భారత సైన్యానికి 155 ఎం.ఎం. హోవిట్జర్ గన్ల సరఫరా విషయమై స్వీడన్‌కు చెందిన ఎ.బి.బోఫోర్స్ కంపెనీతో ఒప్పందం కుదిరింది. రూ.1,437 కోట్ల వ్యయంతో 400 గన్లు కొనుగోలు చేయడానికి 1986 మార్చి 24న ఒప్పందం కుదిరింది. అయితే ఈ విషయంలో రూ.64 కోట్లు చేతులు మారినట్లు 1987 ఏప్రిల్ 16న స్వీడిష్ రేడియో ప్రకటించింది. దీనిపై 1990 జనవరి 22న సీబీఐ కేసు నమోదు చేసింది. బోఫోర్స్ కంపెనీ అధ్యక్షుడు మార్టిన్ ఆర్డ్‌బో, మధ్యవర్తులుగా వ్యవహరించిన విన్ చద్దా, హిందూజా సోదరులు, ఇటలీకి చెందిన ఒట్టావియో ఖత్రోచి, అప్పటి రక్షణశాఖ కార్యదర్శి ఎస్.కె.భట్నాగర్‌లపై రెండు విడతలుగా అభియోగ పత్రాలు దాఖలు చేసింది. దర్యాప్తునకే దాదాపు రూ.250 కోట్లు ఖర్చయింది. కుంభకోణం విలువ కన్నా, దర్యాప్తు వ్యయమే అధికంగా ఉందని భావించి 2005లో దిల్లీ హైకోర్టు ఈ కేసును కొట్టివేసింది. అంతేగాక, లంచాలు ఇచ్చినట్లు సీబీఐ నిరూపించ లేకపోయిందని తెలిపింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ 2018లో సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కానీ, సుమారు 13 ఏళ్ల ఆలస్యంగా అప్పీలు చేయడం సరికాదంటూ అత్యున్నత న్యాయస్థానం దాన్ని తిరస్కరించింది. అయితే, దీనిపై 2005లోనే అజయ్ అగర్వాల్ అనే న్యాయవాది అప్పీల్ చేయగా.. ఆ పిటిషన్‌పై విచారణ కొనసాగుతోంది.





# బూడిద గుమ్మడికాయ జ్యూస్

**బూడిద గుమ్మడికాయలను సహజంగానే చాలా మంది దిష్టి తీసేందుకు లేదా దిష్టి తగలకుండా ఉండేందుకు ఇంటి ప్రధాన ద్వారం వద్ద కడుతుంటారు. బూడిద గుమ్మడికాయ అంటే చాలా మందికి దిష్టి తీయడమే ముందుగా గుర్తుకు వస్తుంది. కానీ ఆయుర్వేద ప్రకారం చూస్తే బూడిద గుమ్మడికాయ మనకు ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. బూడిద గుమ్మడికాయలతో కొందరు కూరలు చేసుకుని తింటారు. ఇంకా కొందరు తీపి పదార్థాలను కూడా తయారు చేస్తుంటారు. అయితే బూడిద గుమ్మడికాయలను తినడం ఇష్టం లేని వారు దీంతో జ్యూస్ తయారు చేసి కూడా రోజూ తాగవచ్చు. బూడిద గుమ్మడికాయ జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఈ జ్యూస్ ఎన్నో వ్యాధులకు ఔషధంగా పనిచేస్తుంది. దీన్ని రోజూ తప్పనిసరిగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.**

### జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..

బూడిద గుమ్మడియ జ్యూస్‌ను తాగడం వల్ల జీర్ణవ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీని వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు. బూడిద గుమ్మడికాయ జ్యూస్‌లో నీరు అధిక మొత్తంలో ఉంటుంది. అందువల్ల ఈ జ్యూస్‌ను సేవిస్తే జీర్ణాశయంలో ద్రవాల సమతుల్యత పెరుగుతుంది. పేగుల్లో మలం సులభంగా కదులుతుంది. సుఖ విరేచనం అవుతుంది. మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ జ్యూస్‌లో ఆల్కలైన్ గుణాలు ఉంటాయి. దీని వల్ల జీర్ణాశయంలో ఆమ్లాలు అధికంగా ఉత్పత్తి అవకుండా అడ్డుకోవచ్చు. దీంతో అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే అల్సర్లు తగ్గిపోతాయి. ఈ జ్యూస్ జీర్ణాశయంపై చల్లని ప్రభావాన్ని చూపిస్తుంది. దీని వల్ల జీర్ణాశయం గోడలు ఆరోగ్యంగా ఉంటాయి. కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది.

### బరువు నియంత్రణలో..

బూడిద గుమ్మడికాయ జ్యూస్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అందువల్ల ఈ జ్యూస్‌ను సేవిస్తుంటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో తీసుకునే ఆహారంపై నియంత్రణ ఉంటుంది. ఇది అధిక బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది. ఈ జ్యూస్‌ను తాగుతుంటే శరీర మెటబాలిజం సైతం పెరుగుతుంది. దీని వల్ల క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. బూడిద గుమ్మడికాయ జ్యూస్‌లో నీరు అధికంగా ఉండడం వల్ల దీన్ని తాగితే శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. దీంతో కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కిడ్నీల పనితీరు మెరుగు పడుతుంది. శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు సులభంగా బయటకు పోతాయి. శరీరం సహజసిద్ధంగా డిటాక్స్ అవుతుంది.

### గుండె జబ్బులు, క్యాన్సర్ రావు..

బూడిద గుమ్మడికాయల్లో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఒత్తిడి, ఆందోళన తగ్గేందుకు దోహదపడతాయి. మైండ్ రిలాక్స్ అయ్యేలా చూస్తాయి. తరచూ ఈ జ్యూస్‌ను తాగుతుండడం వల్ల మూడ్ మంచిగా మారుతుంది. హ్యాపీగా ఉంటారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి కూడా పెరుగుతాయి. బూడిద గుమ్మడికాయల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం ఇన్ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. అలాగే ఈ జ్యూస్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. బూడిద గుమ్మడికాయల్లో ఉండే హైడ్రేటింగ్ గుణాలు చర్మాన్ని తేమగా ఉంచుతాయి. చర్మం కాంతివంతంగా మారేలా చేస్తాయి. ఇలా బూడిద గుమ్మడికాయలతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు. కనుక వీటి జ్యూస్‌ను రోజూ తాగడం మరిచిపోకండి.

# భారత్‌లో వేగంగా తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు

**న్యూఢిల్లీ :** ప్రపంచంలోనే ఎక్కువ యువత ఉన్న దేశం మనదని గొప్పగా చెప్పుకుంటాం. 'యువ భారతం'గా మన దేశాన్ని పిలుచుకుంటాం. ఒళ్లొంచి పని చేసే యువ జనాభా ఎక్కువగా ఉండటమే భారత్ బలం. అయితే, ఈ బలం భవిష్యత్తులో ఉండకపోవచ్చు. ఇప్పటి 'యువ భారతం' మూడు దశాబ్దాల తరువాత 'వృద్ధ భారతం'గా మారబోతున్నది. జనాభా రేటు తగ్గిపోయి, వృద్ధుల జనాభా పెరగడం వల్ల ఇప్పుడు జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ఆ దేశాల అభివృద్ధికి ఇది అడ్డంకిగా మారుతున్నది. ఇదే పరిస్థితి 30 ఏండ్ల తర్వాత మన దేశానికీ ఎదురుకాబోతున్నది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండనుంది.

ఒక మహిళ 15 ఏండ్ల నుంచి 49 ఏండ్ల మధ్య వయసులో జన్మనిచ్చే పిల్లల సంఖ్య సగటును సంతానోత్పత్తి రేటుగా లెక్కిస్తారు. 1950లో దేశంలో సంతానోత్పత్తి రేటు 6.18గా ఉండేది. అధిక జనాభా కారణంగా ఆహార కొరత వంటి సమస్యలు తలెత్తడంతో 1951 నుంచి కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఇద్దరిని మించి కనవద్దని అవగాహన కల్పించారు. దీంతో క్రమంగా సంతానోత్పత్తి రేటు తగ్గుతూ వచ్చింది.

ఈ తగ్గుదల మరీ ఎక్కువ కావడమే ఇప్పుడు సమస్యగా మారింది. జనాభా తగ్గొద్దంటే సంతానోత్పత్తి 2.1గా ఉండాలి. మన దేశంలో సంతానోత్పత్తి రేటు వేగంగా ఈ రీప్లేస్‌మెంట్ స్థాయికి దిగువకు పడిపోతున్నది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 31లో సంతాన రేటు 2.1కు, అంతకు దిగువకు పడిపోయింది. బీహార్, యూపీ, జార్ఖండ్, మేఘాలయ, మణిపూర్ మాత్రమే ఎగువన ఉన్నాయి. 2019-21కి దేశంలో సంతానోత్పత్తి రేటు 2.0తో రీప్లేస్‌మెంట్ స్థాయికి దిగువకు తగ్గినట్టు కేంద్రం వెల్లడించింది.

**తేరుకోకపోతే సంక్షోభమే :** భారత్‌లో సంతానోత్పత్తి ఇలాగే కొనసాగితే 2050 నాటికి 1.29కు పడిపోతుందని ఇటీవల లాన్సెట్ జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. అంటే, మరో మూడు దశాబ్దాల్లో దేశంలో వృద్ధుల జనాభా భారీగా పెరగడంతో పాటు మొత్తం జనాభా సంఖ్య తగ్గిపోనున్నది. ఇదే జరిగితే దేశానికి బలంగా ఉన్న శ్రామిక శక్తి తగ్గిపోయి ఆర్థిక వృద్ధి కుంటుపడుతుంది. వృద్ధుల జనాభా పెరగడం వైద్య సేవలు, పింఛన్ల వ్యవస్థపై భారం పెంచుతుంది. కాగా, జీవన వ్యయం పెరిగిపోవడం వల్ల ఒకరిని మించి పిల్లలను కనేందుకు యువ దంపతులు వెనకాడటం సంతానోత్పత్తి రేటు తగ్గడానికి ప్రధాన కారణం. వివాహాలు ఆలస్యంగా చేసుకుంటుండటం, మానసిక ఒత్తిడి, జీవనశైలి, వాతావరణ సంబంధ సమస్యల వల్ల వంధ్యత్వం పెరగడం కూడా కారణమే. భారత్‌లో ఇప్పటికీ యువ జనాభా ఎక్కువ కాబట్టి వెంటనే అప్రమత్తమైతే భవిష్యత్తులో తలెత్తే సంక్షోభాన్ని నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



తాన్యా రవిచంద్రన్

# అవతార్ 3.. ప్రేక్షకుల ఊహకు మించి ఉంటుంది: జేమ్స్ కామెరూన్



జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'అవతార్'. దీని రెండు భాగాలు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ప్రేక్షకాదరణను పొంది రూ.కోట్లు వసూలు చేశాయి. ఇప్పుడు దీని మూడో భాగం భారీ అంచనాల మధ్య తెరకెక్కనుంది. 'అవతార్- ఫైర్ అండ్ యాష్' పేరుతో రానున్న ఈ సినిమాపై జేమ్స్ కామెరూన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. గత రెండు చిత్రాలతో పోలిస్తే దీని నిడివి కూడా రెట్టింపు ఉంటుందన్నారు. "ప్రేక్షకుల అంచనాలకు మించి ఈ చిత్రం ఉంటుంది. తెరపై ఈ విజువల్ వండర్‌ను చూసిన తర్వాత ప్రతిఒక్కరూ ఆశ్చర్యపోతారు. గతంలోని రెండు చిత్రాల్లో చూపిన వాటిని ఎక్కడా పునరావృతం కాకుండా చూసుకుంటున్నాం. వాటికి బదులుగా కొన్ని ధైర్యమైన ఎంపికలతో మీ ముందుకు వస్తాను. ఇలా ధైర్యం చేసి కొన్నింటిని సృష్టించకపోతే ప్రతిఒక్కరి సమయాన్ని, డబ్బును వృథా చేసినవాడిని అవుతాను. రెండు భాగాల్లో లేని అద్భుతాలను అవతార్ మూడో పార్ట్‌లో చూస్తారు. మీ అంచనాలకు మించిన లైవ్-యాక్షన్‌ని ఇందులో చూస్తారు. మరో కొత్త ప్రపంచం భిన్నమైన కథనం, విభిన్నమైన పాత్రలు ఇందులో కనిపిస్తాయి. ఈసారి పాత్రలపై ఎక్కువ దృష్టి పెడుతున్నాం" అని చెప్పారు. ప్రపంచ చిత్ర పరిశ్రమలో 'అవతార్' ఓ సంచలనం. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ఓ అద్భుత ప్రపంచమిది. పండోర అనే కల్పిత గ్రహాన్ని సృష్టించి అందులోని ప్రకృతి అందాలను కళ్లు చెదిరే విజువల్ ఎఫెక్ట్స్‌తో అందరినీ కట్టిపడేశారు దర్శకుడు. ఆ తర్వాత 'అవతార్: ది వే ఆఫ్ వాటర్'తో మంచి ట్రీట్ ఇచ్చారు. ఆ ఫ్రాంచైజీలో రానున్న మూడో భాగాన్ని పంచ భూతాల్లో ఒకటైన అగ్నికి సంబంధించిన కాన్సెప్ట్‌తో రూపొందించనున్నారు. 2025 డిసెంబరు 19న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. అవతార్ ఫ్రాంచైజీలో రానున్న 'అవతార్ 4' 2029లో, చివరిగా రానున్న 'అవతార్ 5' డిసెంబరు 2031లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే.